# సుబ్బన్న చెప్పిన సబబు

బండెడ్లు మెడమువ్వలు గలగల లాడుతూ సప్పుడు చేసికొంటూ పరుగు లెడుతున్నాయ్. నొగమీదకూర్చున్న బండతనికి పగ్గాలు బిగపట్ట శక్యంగావటం లేదు!

దూరాన్నుంచి ఏదో పల్లెపాట (శావ్యంగా సన్నంగా వినిపిస్తోంది. పక్షులు కిచకిచ లాడుతూ గూళ్లు చేరుకొంటున్నాయ్. అల్లంతదూరంలో అక్కడా అక్కడా పచ్చికమేస్తున్న పశు సముదాయాలు కన బడుతున్నయ్. భానుడు అరుణకిరణాల్ని వెదజల్లుతూ (ప్రకృతికన్యకు వినూత్నమయిన సోయగాన్ని చేకూరుస్తున్నాడు.

బండతనుకూడా మంచి హుషారుగా కబుర్లుచెప్తున్నాడు: "......బాబుగోరూ! రెండు సిగరట్టు పీకలుంటే ఇప్పించండీ... ఏటీ! కాల్సే అలవాటే లేదంటారా...... ఏటుండి! బస్తీబాబులుగందా - ఇంత చేటల వాటుండదా అనుకొండాను......అది సరే గానుండీ......మీ రెన్ని గలాసుల సదువు సదివినారుండీ?......ఏటీ! పద్దకొండుగలాసులే!! నేనికయినా పెట్టిపుట్టాలిగండాండి; మా బుడ్డోడున్నాడాండీ...? అడ్ని సదువుకోరా అంటే ససేమిరా సదవనంటాడుండీ......ఎడ్లజత మొన్ననే కొన్నానండి ...ఎట్టాగుందంటారు? ... సూశారా సుతారాలా గాలపులు తీత్తన్నాయ్...ఏవుండోయ్ పల్లెపాలెం కివార్లకొచ్చేశినంలెండి..."

కబుర్లు చెబుతూనే బండి మలుపు తిప్పాడు.

దారి పొడుగునా గతుకులూ గోతులూ ఉండటం మూలాన్న కిందికి పడుతూ లేస్తూ పోతున్నది బండి. ఎడ్లలోకూడా మునుపటి ఉత్సాహం లేదు. మొల్లో మంటూ లాక్కు పోతున్నాయ్—కానీ బండతను మాత్రం ఎప్పటిలానే కొరడా మాటిమాటికీ ఝళిపిస్తూ హుషారుగానే వున్నాడు.

(ప్రకృతికన్య తెల్లచీరవిప్పి నల్లచీర కట్టుకుంది. నా ఆలోచనలు మాధవయ్య మావ వైపుకి మళ్ళాయి మాధవయ్యమావ 'పల్లిపాలెం'లో కాపరంవుంటూ (ప్రక్కగా వున్న 'వుప్పాంగల' గ్రామంలో కరిణీకం చేస్తున్నాడు. రెండు గ్రామాల్లోనూ మంచి పలుకుబడి, పరపతీ వున్నాయ్.

సెలవ లివ్వంగానే 'పాలెం'లో పదిరోజులుండి రావటం అలవాటు. మరి మాధవయ్య మావకూడా చాలా సరదాఅయిన మనిషి. పొలాలమ్మట తీసుకుపోతాడు. అప్పటి కప్పుడు పాలెకాపుచేత లేతకొబ్బరికాయలు కొట్టిస్తాడు. ఒకొక్కప్పుడు మొక్క జొన్న కండెలు - మరొకప్పుడు తేగలు. ఏమేమో చిత్రవిచిత్రాలయిన పల్లెగొడవలు చెబుతాడు. ఒకొక్కప్పుడు తన స్వీయానుభవాల్నికూడా చెప్పడంకద్దు. అవన్నీ అనేక కథలుగా అల్లొచ్చు అనిపిస్తోంటుంది. ఒకొక్కప్పుడు పక్క పక్క గ్రామాలకి తనతోబాటుగా తీసుకపోయి అక్కడున్న వింతలూ, విశేషాలూ చూపిస్తాడు. నేనున్నన్నాళ్ళూ విధిగా పేపరు తెప్పిస్తాడు. మావయ్యకి ఇద్దరమ్మాయిలు. అలివేణి పెద్దది. సీతమ్మ చిన్నది.

అలివేణి అదో తరహా మనిషి. అవసరం అయితేతప్ప ఎవళ్ళతోనూ మాటాడదు. పని వున్నప్పుడు పనిచెయ్యటం - లేనపుడు ఏదో పుస్తకం పట్టుకు కూర్చోవటం.

మరి సీతమ్మమాత్రం ఒట్టి చీమిరపకాయ! పొట్టిగా ఉంటుంది గాబట్టి అందరూ ముద్దుముద్దుగా "పొట్టెమ్మాయ్" అని పిలవటం పరిపాటి. అన్నీ తింగణా కబుర్లే చెబుతుంది.

అత్తయ్యకూడా చాలా ఆప్యాయత గల మనిషి ......

ఆలోచనల కంతరాయం కల్గిస్తో కంచుకంఠం ఖంగుమనిపించాడు బండతను "బాబుగోరూ" అంటూ.

"ఏమిటోయ్...?" అన్నానుచికాగ్గా.

"అదేనుండీ ... కరణంగోరిల్లు ఒచ్చేసిందండి" అన్నాడు.

అనవసరంగా చికాకుపడినందుకు సిగ్గుపడుతూ బండిదిగాను. పక్కింటమ్మాయితో గిలికజ్జాలాడుతూన్న 'పొట్టెమ్మాయ్' నన్ను చూడగానే "అచ్యుతం బావొచ్చాడేవ్ ...." అంటూ లోపలికి తుఱ్ఱుమంది. బండతనికి అర్ధరూపాయిచ్చి బాగ్ పట్టుకొని లోపలికి వెళ్లాను.

అత్తయ్య సవాలక్ష కుశల(ప్రశ్నలడిగింది. అన్నిటికీ ఓపిగ్గా సమాధానాలిచ్చాను.

"వెళ్తాడు - ఏపొద్దనగా బండెక్కావో? కడుపు కరకరలాడుతూ వుంటుంది. అమ్మాయ్ ... అలివేణీ! పీటా కంచం పెట్టవే నాన్న ఆరోగ్యం బావుందా నాయనా? పోయి పెరట్లో కాళ్లు కడుక్కురా..." అందత్తయ్య.

సరేనని పెరట్లోకి నడిచాను.

అన్నం అంతగా సయించలేదు .... పెరుగన్నం కలుపుకొంటూంటే అత్తయ్య అంది "అదేం తిండిరా! మాకాలంలో...."

ఇప్పుడు తన చిన్నతనపు సంగతులన్నీ ఏకరువు పెడుతుందేమో అనుకొంటూ, "అత్తయ్యా! మావయ్యేడీ.. ?" అన్నాను ప్రసంగం మార్చే ఉద్దేశంతో.

వస్తున్నానని ఉత్తరమయినా వ్రాశావ్ గాదేంరా? మావయ్య నిన్ననే జమా బందీలకని కాకినాడ వెళ్లారు.........వారం రోజులు పట్టొచ్చేమో........." అంది అత్తయ్య

"హతోస్మి!!" అనుకొన్నా.

## 2

భళ్లున తెల్లారింది!

దంతధావనానికని పెరట్లో కొచ్చేప్పటికి పొట్టెమ్మాయ్ గొల్లున ఏడుస్తోంది!!

"సంగతేమిటత్తాయ్...?" అన్నాను- నిజానికత్తయ్య అక్కడ లేనేలేదు.

పట్నవాసాల్లో వ్యక్తిత్వానికి గౌరవం ఉండదు. ఎంత సేపూ చట్టానికే అధిక గౌరవం ఇవ్వబడుతుంది. పల్లెటూళ్ళలో మటుకు సాధారణంగా వ్యక్తిత్వమే నాలుగు కాళ్లా చెలామణీ అవుతో ఉంటుంది. ఏదయినా తగాయిదా వచ్చిందంటే పల్లెకి పెదకాపు తనకు తోచిన రీతిలో తీరుస్తాడు.

కాశ్మీర్ - కుసుమం
క్రొత్తశక్తి, మధురిమ, అకాల నెరలను ఆపుటకు
మీ ఇష్టమైన నూనెలో నానవేయండి
యునైటెడ్ కేసరీక, బందరు వీధి, మద్రాసు-1 విజయవాడ
నిరపాయకరమైన
నంజనగూడు పండ్లపొడి
ఇతర 54 ఔషధములు
జాబితా ఉచితము

"పాడిగేదె రాత్రి రొమ్ముచ్చి చచ్చిపోయింది......అదంటే పాలేటమ్మాయికి బోలెడు ప్రేమ!" అంది అలివేణి ముసిముసిగా నవ్వుతూ.

వేపపుల్ల విరుచుకొని గొడ్ల చావిటి వైపు నడిచాను.

పిల్లలూ పెద్దలూ చాలామంది చుట్టూ మూగి వున్నారు. రకరకాలుగా తమతమ తాపాలను వెళ్ళగ్రక్కుతున్నారు ప్రతి వక్కరూ.

అత్తయ్య చుట్టూ చేరిన ముత్తయిదువులతో చనిపోయిన సవిగు గేదె తాలూకు గుణగణాలన్నీ ఏకరువు పెడుతోంది.

ఒక పండు ముత్తయిదువ బుగ్గలు నొక్కుకుంటూ "దుక్కలాటి బర్రెమ్మా..... అయినా ఆ యముడాడికి ఉన్నట్టుండి ఇటువంటి పాడుబుద్ధి కలుగుతుందని కలగన్నామా! ఒక క్షణం ముందు వెనుకల్లో అంతా వెళ్ళవలసిన వాళ్ళేగదా అమ్మా... గీతా రహస్యంలో శ్రీకృష్ణ పరమాత్ముడన్నట్లూ . ..." అంటోంది అందర్నీ తప్పించుకొని లోపలికి వెళ్ళాను.

గేదె చచ్చి పడివుంది వీరన్న కాపూ, చౌదరయ్యా, వెంకయ్య తాత ఇంకా కొంతమంది కాపులూ మోకాళ్లినానుకుని కూర్చుని తాపీగా లావుపాటి లంక చుట్టలు కాలుస్తున్నారు

వీరన్న కాపు మా మావయ్య భూములు సేద్యం చేసే రైతు రెండు చేతులా ఇంతి తినటానికి పెట్టటానికి సరిపడ్డ ఆస్తి వెనకేసుకొని తీరుబాటుగా కాలం వెళ్ళబుచ్చే వ్యక్తి వెంకయ్య తాత మహా ఘట్టి సానికొంభూని! చౌదరయ్య మాత్రం ఉప్పంగల వాస్తవ్యుడు మావయ్య వన్నంటే ఉంటాడు ఎప్పుడూ. మావయ్యకి కుడిభుజం లాంటి మనిషి!......మావయ్య కూడా అతనికి చాలా విధాలుగా సహాయం చేశాడని చెప్పుకొంటారు. ఉప్పంగల గ్రామాన్ని గురించి కానీ, ఆ గ్రామవాసుల్ని గురించి గానీ పల్లెత్తు ఒక్కమాట సహించలేడు ఏది వొచ్చినా అనవూరి తరఫున వకాల్తా పుచ్చుకొన్నట్లు వాదిస్తాడు.

మెల్లిగా పోయి వీరన్న కాపు పక్కగా కూర్చున్నాను.

మరో క్షణంలోకే — కళ్ళల్లో చింత నిప్పులు చెరుగుకుంటూ, తీవ్రంగా మాటామాటా అనుకొంటూ యిద్దరు ఆగంతకులు రంగంలోకి ప్రవేశించారు అందరూ నివ్వెరపోయి చూస్తున్నారు ఏం జరగబోతోందా అని.

చౌదరయ్య ఇద్దరిలో ఒకడి మద్దతించి "ఏరా వెంకడూ! యేం విషయం...?" అన్నాడు చుట్టనుసి దులుపుకొంటూ.

"అసలీడికిక్కడికి రావల్సినవసరం ఏవొచ్చిందండీ .. పతీదానికీ పోటీకి వొత్తం డాడు దొంగరొయ్యడు! ఏగేమైనా ఈ బర్రెని నే పట్టుకు పోవల్సిందేనండీ ... అన్నాడు వాడు.

అవతలవాడుకూడా ఏదో అనబోతుండగా నే చౌదరయ్య గర్జించాడు గంభీరంగా: 'నాయం ఎంకడివైపే వుంది. అది సరే గాని ఏరా భద్రుడూ! నిన్నెవరు రమ్మన్నారురా?"

"నాయంవుండట నాయం.. ఆణ్ణి నేనే పిలిపించాను" అన్నాడు వెంకయ్య తాత పళ్లు పటపట కొరుకుతూ

విషయం ఏమిటని వీరన్న కాపునడిగాను. ఆశ్చర్యంగా నాకేసి చూస్తూ "మీ రెప్పుడొచ్చారు బాబులూ...?" అన్నాడు. సమాధానం చెప్పి వెనకటి ప్రశ్నే అడిగాను రెట్టించి

"అదేనండీ...అడు మన పల్లిపాలెంబారి కోడు - ఈడు ఉప్పంగల బారి కోడు. గేదని నేతీసుకుపోతానంటె నే తీసుకుపోతనని తగవు లాడుతున్నారండీ .." అంటూ "ఒరేయ్ కోటాయ్! - పెదకాపుగారికి ఇషయం కబురు చెప్పు" అన్నాడు వీరన్న కాపు

కోటాయ్ త్వరత్వరగా అంగలు వేసికొంటూ నిష్క్రమించాడు.

ఇరుపక్షాలవారు ఇంకా మాటా మాటా కసిగా అనుకుంటూనే వున్నారు. ఒక్కొక్కప్పుడు మరీ జడిగా వుంది.

ఈసారి చుట్టూచేరిన జనం రకరకాలుగా న్యాయాన్యాయాలు చెప్పుకొంటున్నారు.

మరో అయిదునిమిషాలు గడిచాయో లేదో కోటాయ్ రొప్పుకుంటూ వచ్చాడు.

న్యాయమూర్తి: నువ్వు జేబు కత్తిరిస్తుండగా ఆరుగురు చూశామంటున్నారు. ఇందరు సాక్షులున్నా నువ్వు నేరం ఒప్పుకోవేం?

నిందితుడు: దానికేముంది లెండి. నేను జేబు కత్తిరిస్తుండగా చూడలేదని 60 మందిని సాక్ష్యం తేగలను


"పెదకాపుగారేమన్నార్రా...?" ఆత్రంగా అడిగాడు వీరన్న కాపు

"చెప్పేనండీ...మరోఘడియ గడిచాక రాంకోవిలకి రమ్మనా...అన్నారండి" ఒగర్చుకుంటూ చెప్పేడు కోటాయ్.

"పెదకాపుగారు తీర్పు చెస్తారుగా..." అనుకొంటూ ఒకొక్కరే నిష్క్రమించారు.

## 3

పట్నవాసాల్లో వ్యక్తిత్వానికి గౌరవం వుండదు ఎంతసేపూ ధనానికే అధిక గౌరవం ఇవ్వబడుతుంది కాని మున్సిపల్లు పడి ముప్ఫైమూడూ కోట్లుతిరిగి వ్యవహారం సీదాగా పరిష్కారం చెసుకొనేసరికి ఇల్లూ వొళ్ళూ గుల్లయి కూర్చుంటుంది. కాగా—



# ★ సుబ్బన్న చెప్పిన సబబు ★

పల్లెటూళ్లలో మటుకు సాధారణంగా వ్యక్తిత్వమే నాలుగుకాళ్లా చెలామణీ అవుతోంటుంది. ఏదియినా తగాయిదా వచ్చిందంటే పల్లెకి పెదకాపు తనకు తోచిన రీతిలో తీరుస్తాడు. ఏదే మనసీ పెదకాపు చెప్పిన తీర్పుకి బద్ధులై వుండాల్సిందే! మరి 'రామకోవిల'లే తీర్పులు చెప్పబడే న్యాయస్థానాలుగా వ్యవహరింప బడుతాయ్.

గంభీరమయిన వదనం ... బలిష్టమయిన శరీరం...నల్లగా నిగనిగలాడే మెలేసిన మీసాలూ...నోట్లో లావుపాటి చుట్టా...నిశితమయిన దృక్కులూ...వెనక్కి ముడివైచి కట్టబడివున్న జుత్తుముడీ...వొంటికి వొదులుగావున్న గ్లాస్కో లాల్చీ—అందులోంచి స్పష్టంగా కనబడుతోన్న లేసు బనీనూ...మాంచి తమాషాగా కట్టబడిన ఆ పంచెకట్టూ ... చేతిలో పొన్నుకర్రా ... కాళ్లకి కిర్రుచెప్పులూ...వాలు కుర్చీమీద ఠీవిగా కాలుమీద కాలేసుకొని కూర్చున్న




ఆసామిని చూపిస్తో అంది పాపాయమ్మాయి "అతనేరా-సుబ్బన్న పెదకాపు..." అని.

రామకోవిలకి దగ్గరగావున్న ఎత్తుటరుగుల మీద కూర్చుని చూస్తున్నాం పాపాయమ్మాయీ నేనూను.

వీరన్నకాపూ...చౌదరయ్యా ... వెంకయ్యతాతా...కోటాయ్...వగైరా వగైరా లంతా హాజరయ్యారు.

పెదకాపు సుబ్బన్న కిర్రుచెప్పు లోమారు కిర్రుమనిపించి, చుట్ట నుసి దులుపుకొంటూ అన్నాడు: "అంతా ఒచ్చినోట్టునోరు... ఈ సారేం సెప్పుకొంటవో సెప్పుకోరా ఎంకడూ..."

"అదికాదుండి పెదకాపుగోరో...ఎక్కడయినా నాయం వుందుండీ? కరణంగోరు మా వూరి మడిసి అవటం ఏటీ-ఆరిగేదె సచ్చిపోతే నాకు పోనీకండా ఈ దొంగయెదవ ఎగరేసుకు పోవటం ఏటుండి! ఎంత కాదన్నా కరణంగోర్కి ఆరి కుటుంబానికి మా సెర్మం ఒలిసి సెప్పులు కుట్టిచ్చినాం గందాండి...అటువోంటాప్పుడు నాకు రావల్సిందే గందాండీ..." అన్నాడు వెంకడు చాలా ధాటీగా.

చౌదరయ్యా పండుమీసాలు మెలేసి, చేతికర్రొకసారి నేలకి తాటించడంలో "నేనేసుమా ఎంకడికిన్ని లాపాయింట్లూ నూరిపోసింది..." అన్న అహం ప్రస్ఫుటమవుతోంది.

కొద్ది సేపయాక సుబ్బన్న కాపు గంభీరంగా అన్నాడు: "ఇక భద్రడు సెప్పకానేదేటో సెప్పుకోచ్చు......"

"నాయం సెప్పుకోవాలి పెదబువులు... కరణంగోరి గేదె నూత్తే మనూర్లోనే పుట్టింది—మనూరు గడ్డితినే పెరిగింది—మనూర్లోనే సచ్చింది—గందాండీ? అటువొంటాప్పుడు...దాని బతుకంతా మనూర్లో అవటుం ఏటీ—అదింకో వూరు రొయెదవ సేతుల్లోకి పోవటం ఏటి!? ఇయ్యాల్టికిదొద్దు! రేపటికింకోటొద్దు!! అదీగాక—మా అయ్యా, అయ్య అయ్యా, ఆడి కయ్యల పుట్టీ ఈ పాలేన్ని కనిపెట్టుకున్నాంగందాండీ... ఇట్టాగవుతే మరి ఉండగల్తుమా?" అన్నాడు భద్రడు మరీ ధాటీగా.

"మా బాగా సెప్పకొన్నావ్ రా భద్రడూ......మనూరిగడ్డి మా సేవయిందిగా మట్టే కరణం గోరి గేదె దుక్కలా బలిసింది. మరో వూరుగడ్డి అయితే ఎప్పుడో సచ్చేది" అన్నాడు వెంకయ్య తాత భద్రడికి బలం చేకూర్చాలన్నట్టుగా.

లెంపకాయ కొట్టినట్టయింది చౌదరయ్యకి. ఎక్కడలేని అభిమానం ముంచుకొచ్చింది—తన గడ్డిని వెంకయ్య తాత పరోక్షంగా ఆడిపోసుకొన్నందుకు. అలవాటు ప్రకారం భుజాలొకసారెగరేసి "గడ్డి గడ్డని మిడిసి పడుతుండారు—మా వూరు గడ్డిబీళ్లు నూడండి తెలుత్తాది.......ఊరికే మాతలు కూయంగానే సరిపోదు" అన్నాడు.

"అయితే మీ వూరు గడ్డి బీళ్ళకే నన్నమాట ప్రసిద్ధి..... పాపం—ప్చ...ప్చ" ఒక పల్లిపాలెం వాస్తవ్యుడు గాఢంగా నిట్టూర్చాడు ఊరుకోలేక.

"మా వూర్లో పంట బూములు లేవను కొంటునోరు......? మా వూరు ఆయకట్టు మా దొడ్డది. కావలిస్తే మా కరణంగోరి నడగండి..." అతి కోపంలో కాస్త తడబడ్డాడు చౌదరయ్య.

వాతావరణం చాలాగా వేడెక్కిపోయింది.

సుబ్బన్న కాపు లేచి నిలబడ్డాడు!—త్రాసు ఎటువైపు మొగ్గుతుందో మరి.?

"నాయంగా నూత్తే.....మాధవయ్య గోరు మనూరు కరణం గోరు కాదు. 'కరణం గోరు మా వూరు మడిసి అవటం ఏటీ—ఆరి గేదె సచ్చిపోతే నాకు పోనీకండా ఇంకో దొంగ రొయెదవ ఎగరేసుకుపోవటం ఏటీ...ఎంత కాదన్నా కరణం గోర్కి, ఆరి కుటుంబానికి సెర్మం ఒలిసి సెప్పులు కుట్టిచ్చినాంగందాండీ......' అంటున్నాడు ఎంకడు. కాకపోతే—కరణం గోరి గేదె మనూర్లోనే పుట్టింది—మనూరు గడ్డి తినే పెరిగింది—మనూర్లోనే సచ్చింది కూడాను—భద్రడు సెప్పినట్టు. నాయం నూత్తే ఇద్దరెప్పూ ఉన్నట్టుండాది!—అందుకని నే సెప్పేదేటంటే...మనూర్ని నమ్ముకున్న మడిసి భద్రడు—మనూరి గడ్డితిని బల్సిన కరణం గోరి గేదె తోలూకు మాంసం భద్రడికి వెళ్ళటం నాయం. కాకపోతే కరణం గోర్కి సెప్పులు కుట్టిచ్చే ఎంకడికి సదరు గేదె తాలూకు సెర్మం వెళ్ళటం నాయం....." ఇరు పక్షాలకీ న్యాయం చేకూరేట్టు సబబు చెప్పేడు సుబ్బన్న కాపు. ★

న్యాయవాది: నువ్వు నేరం చెయ్యలేదంటావు. నేరం జరిగినప్పుడు నిన్ను చూచినవారెవరైనా ఉన్నారా?

ముద్దాయి: అదృష్టవశాత్తూ ఎవ్వరూ చూడలేదండి.